క్లుప్తంగా

సైన్స్ సెమినార్ పోటీల్లో ప్రతిభ



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మండలస్థాయి సైన్స్ సెమినార్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓ పీఎస్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తృణధాన్యాల ఆవశ్యకత గురించి చక్కగా వివరించారు. ఈ పోటీల్లో ధరణి (9వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల), బృంద (9వ తరగతి ఏకాంబరకుప్పం జెడ్పీహెచ్ఎస్), షిమ్‌రాన్‌ఫిరోజ్ (9వ తరగతి పుదుపేట జెడ్పీహెచ్ఎస్), జ్యోతికృష్ణ (10వ తరగతి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల)విజేతలుగా నిలిచారు. వీరికి ఎంఈఓ శ్రీదేవి బహుమతులు ప్రదానం చేశారు.

గర్భిణులకు రక్తపరీక్షలు తప్పనిసరి

పాలసముద్రం : గర్భిణులు ప్రతి నెలా క్రమం తప్పకుండా రక్తపరీక్షలు చేసుకున్న తరువాతే వైద్య పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన గర్భిణులతో మాట్లాడుతూ చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయాలన్నారు. మహిళలు ఎక్కువ శాతం ఐరన్, క్యాల్షియం, విటమిన్స్ కలిగిన ఆహారం ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా శిశుమరణాలు తగ్గించవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు ప్రసవం అయ్యేవరకు ఆశావర్కర్లు వారికి సహాయంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలని సూచించారు. అనంతర గర్భిణులు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు ఎంపీడీఓగా ప్రసాద్



పుత్తూరు రూరల్: పుత్తూరు ఎంపీడీఓగా పి.ప్రసాద్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. చిత్తూరు సీఈఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఈయనకు పుత్తూరు ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఇందిర వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు.

భక్తులకు అన్నదానం



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దాతలు

నగరి : స్థానిక ఓంశక్తి ఆలయం వద్ద తమిళనాడు ఓచ్చేరి నుంచి విచ్చేసిన సుమారు వెయ్యి మంది గోవింద భక్తులకు పట్టణ పరిధిలోని పలువురు దాతలు అన్నదానం చేశారు. దీంతో ఓంశక్తి ఆలయ ఆవరణతో పాటు రహదారి కూడా గోవింద భక్తుల తో నిండిపోయింది. ఆలయంలో భజనలు మిన్నంటాయి. అనంతరం ఆలయంలోని గోవింద భక్తుల తో పాటు, పాదచారులకు కూడా అన్నదానం చేశా రు. పన్నెండేళ్ల పాటుగా భారీ ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దాతల దాతృత్వంపై ఆలయ నిర్వాహకులు ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలో దాతలు ఆరుముగం, పెరుమాళ్, రమేష్, గోపాల్‌రెడ్డి, దయానిధి, మునికృష్ణారెడ్డి, ఎల్లప్పరెడ్డి, కుమార్, వేలు, రామ్ మోహన్, కృపానిధి, అశోక్, రామూర్తి, బాలాజి, ఆనంద్, యుగంధర్,జగన్,హరిపోతన్, పొన్నురంగం పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరు ఆస్పత్రిలో పౌష్టికాహారం అందుకుంటున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రులకు పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులు, బాలింతలకు బుధవారం 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు పరీక్షల నిమిత్తం వేచి ఉండాల్సి రావడంతో మధ్యాహ్న సమయంలో భోజనానికి ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండు అందించారు. ఈ సందర్భంగా గర్భిణులు మాట్లాడుతూ కడుపు నిండా మంచి భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ రోజు మేలు మరువలేమన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్లు నారాయణస్వామి, పుష్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బైబై.. గణేశా..



జైబోలో గణేష్ మహరాజ్‌కీ..

- వేడుకగా గణేష్ నిమజ్జనం
- భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ



అందరికీ సెలవిక..జీడీనెల్లూరులో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



నగరి: ఊరేగింపుగా వెళుతున్న వినాయకుడు

నగరి: వినాయక చవితిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు బుధవారం నిమజ్జనానికి ఊరేగింపుగా తరలివెళ్లాయి. ఈ సందర్భంగా మండపాల వద్ద భక్తిపాటలు హోరెత్తాయి. అనంతరం వినాయక ప్రతిమలను ట్రాక్టర్లలో ఎక్కించారు. బాణసంచా వేడుకల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. జైబోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ రంగుల చల్లుకుంటూ ఊరేగింపుగా వెళ్లారు. ఎల్‌వీఆర్ ఫ్యాక్టరీ పక్కనే ఉన్న నీటి గుంటలో, రామాపురం క్వారీ పక్కన ఉన్న నీటిగుంటలో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. చావడి వద్ద, పద్మావతి నగర్‌లో వినాయక శిబిరాల వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఇంద్రయ్య, రాజేష్, సాయి, బాల, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం : జైజై గణేశా.. జైజైజై గణేశా.. జయము లివ్వు బొజ్జ గణేశా అంటూ యువత గణనాథున్ని బుధవారం నిమజ్జనానికి తరలించారు. వినాయక చవితిని పురస్కరించుకుని మండలవ్యాప్తంగా గ్రామాల్లో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా పాలసముద్రం, ఏటూకూరిపల్లె, మహదేవపురం, వెంగళరాజుకుప్పం, శ్రీబొమ్మరాజుపురం, ఎల్ఎన్ పురం, తిరుమళరాజుపురం, శ్రీకావేరిరాజుపురం, గంగమ్మాబపురం, కేజే పురం, సింహరాజుపురం గ్రామాల్లో నిమజ్జనం కార్యక్రమాన్ని భారీగా నిర్వహించారు. గణేశ్ ప్రతిమలను ట్రాక్టర్లపై నిలబెట్టి ఊరేగింపుగా తీసుకెళ్లారు. యువకులు రంగులు చల్లుకుంటూ డప్పువాయిద్యాల నడుమ చిందులేస్తూ గణనాథున్ని సాగనంపారు. మహిళలు గణనాథుడికి టెంకాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి నైవేద్యం సమర్పించారు. అనంతరం విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేశారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు : మండలవ్యాప్తంగా గ్రామాల్లో గణేశ్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. వీరకనెల్లూరులో చిన్నబ్బ, గోవిందరాజులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. అనంతరం స్వామివారి లడ్డూ వేలం వేయగా మహేష్ రూ.10 వేలకు దక్కించుకున్నారు. డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గణేశ్ ప్రతిమలను ఊరేగింపుగా తీసుకెళ్లి యువత గ్రామ పొలిమేరలోని మంచినీళ్ల గుంటలో నిమజ్జనం చేశారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: బాణసంచా మోతలు.. డప్పు వాయిద్యాలు.. డీజే సౌండ్‌కు యువత సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గణనాథుడు నిమజ్జనానికి తరలివెళ్లాడు. బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటూ చవితి సందడి అంబరాన్ని తాకింది. మండలంలోని తార్లబైలులోని వాసుదేవరెడ్డి ఇండ్లు, కసవనూరు, బొమ్మన్‌దొడ్ల, వెదురుకుప్పం, పచ్చికాపల్లం గ్రామాలతో పాటు అనేక ప్రాంతాల్లో వినాయ విగ్రహాల నిమజ్జనాన్ని యువత పెద్దఎత్తున నిర్వహించారు. ఉదయం నుంచే వినాయక విగ్రహాలకు భక్తి ప్రపత్తులతో నైవేద్యాలు సమర్పించి అన్నదానం చేశారు. వెదురుకుప్పం ఎస్ఐ రమేష్‌బాబు సిబ్బందితో కలిసి గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

విజయపురంలో

విజయపురం (నగరి) : మండలంలో కేవీపురం, గంగమాంబపురం, పీఆర్‌కండ్రిగ, విజయపురం, జంబాడలో వినాయకుని నిమజ్జనం ఘనంగా జరిగింది. సాయంత్రం 5 గంటలకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మేళతాళలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. స్వామివారికి దర్శించుకున్న భక్తులకు ప్రసాదం ఇచ్చారు. అనంతరం స్థానికం గాఉన్న చెరువులోస్వామివారిని నిమజ్జనం చేశారు.

నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామ దళిత వాడలో బుధవారం వినాయక విగ్రహం నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం స్వామివారిని గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. మండలకేంద్రం నింద్రలో ప్రసన్న వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



వెళ్లొస్తా..చావడి ప్రాంతంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



పద్మావతి నగర్‌లో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



కొండచుట్టు మండపం వద్ద ..



పెరుమాళ్‌గుడి వీధిలో...



నగరి : రామాపురం క్వారీ వద్ద నీటిలో నిమజ్జనం



సెలవిక గణనాథా..



వినాయకుని ఊరేగింపులో కోలాటాలు



సల్లగా చూడయ్యా.. గణపయ్యా..



శ్రీబొమ్మరాజుపురంలో ...

భూపాల్ కుటుంబానికి అండగా ఉంటాం



భూపాల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి : ఇటీవల నగరి మున్సిపాలిటీలోని ధర్మాపురం వద్ద జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో భూపాల్ కుటుంబం అసువులు బాసిన సంగతి విదితమే. భూపాల్ తల్లి, సోదరులను మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఇది విషాద సంఘటన అని, పార్టీ తరపున తాము అండగా ఉంటామన్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. బీమా మంజూరు చేయించి ఇస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, సర్పంచ్ పరంధామన్, ఎంపీటీసీ యేసు, భాస్కర్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నగరి : సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర సత్యసాయి సేవాసంస్థల విద్యావిభాగం పిలుపు మేరకు శ్రీ సత్యసాయి విద్యావిధానం విశిష్టతను తెలియజేస్తూ ప్రాంతీయ, జిల్లా, రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీలోపు చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు ప్రత్యేక వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ×ఆచార్య దేవోభవ× అనే అంశంమీద, జూనియర్ కళాశాల్లో విద్యా ర్థులకు 'ప్రకృతియే ఉత్తమ గురువు' అనే అంశంమీద, డిగ్రీ కళాశాల విద్యార్థులకు ×మానవత్వం పెంపొందించే విద్యా ఆవశ్యకత× అనే అంశం మీద తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. ప్రాంతీయ స్థాయి పోటీల ఫలి తాలు అక్టోబర్ 15వ తేదీన, జిల్లాస్థాయి ఫలితాలు అక్టోబర్ 25వ తేదీన, రాష్ట్రస్థాయి ఫలితాలను నవంబరు 5వ తేదీన ప్రకటిస్తామన్నారు. వీటికి సంబంధించిన కరపత్రాలను డీఈఓ విడుదల చేశారు.

ఆర్టీసీలో ప్రయాణించండి

పుత్తూరు రూరల్: పుత్తూరు ఆర్టీసీ డిపో బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులు లక్కీ డిప్ ద్వారా బహుమతులు గెలుచుకోవచ్చని డిపో మేనేజర్ ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ టికెట్ వెనుక భాగంలో తమ పేరు, సెల్ నంబర్‌ను రాసి పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీ, 30న గిఫ్ట్ బాక్స్ తెరిచి లక్కీ డ్రాలో ఫస్ట్, సెకండ్, థర్డ్ ప్రైజ్‌లను ప్రకటించి, సదరు వ్యక్తులకు అందజేస్తామన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మకం

- మంత్రి ఆర్‌కే రోజా



మంత్రి ఆర్‌కే రోజా

నగరి : లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టడంపై మంత్రి ఆర్కే రోజా బుధవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె బిల్లు ప్రవేశపెట్టడానికి చొరవ తీసుకున్న ప్రధాని నరేంద్రమోదీకి, తొలి నుంచి అందుకు మద్దతుగా నిలిచిన సీఎం జగనన్నకు, ఓటింగ్‌లో మద్దతుగా నిలిచిన ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా బిల్లు రాకముందే మహిళలకు 50 శాతం పదవులు, నామినేటెడ్ పోస్టులు ఇచ్చి గౌరవించడం ద్వారా దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగనన్న నిలిచిపోయారని ఆమె కొనియాడారు. 454 ఓట్లతో ఈ బిల్లు ఆమోదం పొందడం చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఒక మహిళగా, మహిళా మంత్రిగా తాను గర్వపడుతున్నానని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తరువాత మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించడం మహిళలకు దక్కిన విజయం అన్నారు.

ఆలస్యం అయినా ప్రస్తుతం కార్యరూపం దాల్చడం అభినందనీయమన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో ఎన్నడూ లేనంతగా నలుగురు మహిళలకు సీఎం జగనన్న అవకాశం ఇచ్చారని, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా, స్థానిక ఎన్నికల్లోనూ మహిళలకు అందరికంటే ఎక్కువ అవకాశాలు ఇచ్చారన్నారు. అలాగే మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలన్నీ కూడా మహిళల పేరు మీదనే అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. మహిళలకు ఏ మంచి జరిగినా మద్దతు ఇచ్చే మొట్టమొదటి పార్టీ ఈ దేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీనే అన్నారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగి మహిళా సమస్యలపైనా, హక్కులపైనా, వారి రక్షణపైనా గళం విప్పేందుకు అవకాశం ఉంటుందన్నారు. వీలైనంత త్వరగా ఆచరణలో పెట్టి మహిళల ఆత్మగౌరవాన్ని మరింత పెంచేందుకు సహకరించాలని కోరుకుంటున్నట్లు ఆమె చెప్పారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టని ప్రభుత్వం
- ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటి వద్దకే వైద్యసేవలు
- తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి రూపకల్పన
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష గురించి వివరిస్తున్న కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పుత్తూరు రూరల్: ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడానికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం కమిషనర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పిళ్లారి పట్టు సచివాలయ పరిధిలో ఇంటింటికి వెళ్లి పథకం గురించి వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలం దించడానికి విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించిందన్నారు. రోగుల వద్దకే వైద్యం అందేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ క్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట మరో బృహత్తర కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. పట్టణాలు, పల్లెల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం గురించి ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష

శ్రీరంగరాజపురం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ పల్లవి అన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఆరోగ్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతిఒక్కరూ గ్రామాల్లో వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా పరీక్షలు చేయాలన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి వారికి కావలసిన మందులను ఉచితంగా అందించాలన్నారు. దేశంలోనే ఏపీని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ముద్దుకుప్పం, నెలవాయి సచివాలయం పరిధిలోని గ్రామాల్లో డాక్టర్ పల్లవి సుమారు 382 మందికి వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిబాబు, జయలక్ష్మి, ఎంపీటీసీ సిద్దయ్య, నాయకులు శ్రీను, కుమార్, మాజీ సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : ప్రజల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వేను బాధ్యతగా చేయాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన శ్రీకావేరిరాజుపురం సచివాలయ పరిధిలో జరుగుతున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ద్వారా 8 రకాల జబ్బులకు మెరుగైన చికిత్స కోసం గ్రామంలో వైద్యపరీక్షలు చేసి టోకెన్లు ఇస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి యశ్వత్, ఏఎన్ఎం రేవతి, అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి, సరళ, ఆశా, వలంటీర్లు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న డాక్టర్ పల్లవి



ఇంటింట సర్వేలో వైద్యసేవలు అందిస్తున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం



బాధిత కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న ఎంపీపీ లత

- రూ.22.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ సాయం
- చెక్కులు పంపిణీ చేసిన ఎంపీపీ

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తోందని ఎంపీపీ లత అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొల్లాగుంట, ఆర్కేవీబీపేట, కార్వేటినగరం పెద్ద దళితవాడ, పద్మసరస్సు ఎస్టీకాలనీకి చెందిన బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.22.50 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రమాదాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో అనతికాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు అయిందన్నారు. కొల్లాగుంట దళితవాడకు చెందిన రాజ(50) ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతనికి భార్య, ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఆ కుటుంబ దీనస్థితి తెలిసి ఉప ముఖ్యమంత్రి తక్షణ సాయం కింద అదేరోజు రూ.10 వేలు అందించడంతో పాటు గతంలో ఎన్నడూ లేనివిధంగా రెండు వారాలకే రూ.5 లక్షలు మంజూరు చేయించి అండగా నిలిచారని గుర్తు చేశారు. అదేవిధంగా పద్మసరస్సు ఎస్టీ కాలనీకి చెందిన సునీత బైక్‌లో వెళ్తుండగా టిప్పర్ ఢీకొని చనిపోయింది.

దీంతో వారి కుటుంబానికి రూ.5లక్షలు, అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అంగవైకల్యంతో బాధపడుతున్న వ్యక్తికి రూ.2.50 లక్షలు, అలాగే విద్యుత్ షాక్‌తో మృతి చెందిన కార్వేటినగరం పెద్ద దళితవాడలోని రామదాసు కుటుంబానికి కూడా రూ.5 లక్షలు, జేఎల్ఎంగా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన ఆర్కేవీబీ పేట యువకుడి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.5 లక్షలు ఆర్థికసాయం అందించి వారి కుటుంబాలకు అండగా నిలిచామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్‌లు ధనంజయవర్మ, దివ్య, దివ్య, శేషాద్రి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ మునికృష్ణ, సుబ్రమణ్యంరెడ్డి, చందురాజు, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మురగయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.